



యల్లాప్రగడ సువర్చలాదేవి

# కాలం చెల్లిన భావాలు

“వాన పడుతున్నట్టుంది... కాస్త బాల్కనీలో బట్టలు తీద్దాం రండిరా” పిల్లల సమాధానం కోసం కూడా చూడకుండా పరుగులాంటి నడకతో బాల్కనీలోకి వెళ్ళింది సుష్మ. గబగబా బట్టలు తీస్తూ వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ లేరు...

అప్పటికే వాన పెద్దదవుతూ ఉండటంతో మరింకేమీ ఆలోచించకుండా బట్టలను తీసి హాల్లోకి వచ్చి చూసేసరికి పదేళ్ళ కొడుకూ, ఎనిమిదేళ్ళ కూతురు ఇందాకటిలాగే ఒకరు టీవీలో కార్టూన్‌తోనూ, మరొకరు కంప్యూటర్లో ఏవో ఆటలు ఆడుకుంటూనూ బిజీగా కనిపించారు.

“ఏరా.. వానొస్తోంది బట్టలు తీయాలి సాయానికి రండిరా అంటే ఆడుతూ కూర్చుంటారా” అంటూ తన ఆవేదన వ్యక్తం చేస్తుంటే వంటింట్లోంచి కుక్కర్ ‘నేనున్నాను’ అంటూ ఆమె ఆవేశానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేసింది విజిల్ రూపంలో.

కుక్కర్ ఆపేసి రాత్రి భోజనంలోకి నాలుగు బంగాళదుంపలను తీసుకొని పనిలో పడింది. ఇంటి పని, పిల్లల సంగతి, భర్త సంగతి చూడటం విసుగ్గా ఉందామెకు. ఎవరూ సరిగా సహకరించడం లేదని చిరాకు. ఈ విసుగులో ఆమె భర్త ఆనంద్ ఎప్పుడు వచ్చాడో కూడా గమనించలేదామె. ఎప్పటికో చూసి “ఓహో వచ్చారా” అనుకొని ఇంట్లో ఏమేమి లేవో, పిల్లలు రానురానూ ఎలా మాట వినకుండా తయారవుతున్నారో, బయట ధరలు ఎలా పెరిగిపోతున్నాయో, ఈ సంసారాన్ని ఈదటం నా వల్ల కాదు అన్నట్లు తన గోడు వెళ్లబోసుకుంది భర్త దగ్గర.

ఎప్పటిలానే ప్రశాంత చిత్తంతోనే విన్నాడా సాధుజీవి. రాత్రి భోజనాలు, పనులు అన్నీ అయ్యి పడుకోబోయే ముందు బెడ్‌రూంలోకొచ్చిన భార్యతో అన్నాడతను ప్రశాంతంగా “మా వైదేహత్త తెలుసు కదా నీకు” అని. “ఆ.... తెలియకే...మీకు ఆ పుస్తకాలను చదవడం, ఆ రచనలు చేయడం వీటన్నింటికీ ఆమే కదా కారణం... ఎందుకొచ్చిన టైం వేస్ట్ పనులు... ఆ టైం పెట్టి మీ కెరియర్‌కి పనికొచ్చే చదువులో, పరీక్షలో రాస్తే కాస్త మీకూ ఎదుగు, బొదుగు ఉంటుంది. నాలుగు రాళ్లైనా వస్తాయి కదా” ఆమెపై తన అక్కసును మరోసారి వెళ్లబోసుకుంది.

“చూడు సుష్మా ఈ చర్చ మన మధ్య చాలాసార్లు వచ్చింది. నాకు తెలుగు సాహిత్యం అంటే ఎంతిష్టమో నీకు తెలుసు. అదీ తప్పుకాదు.. అలా అని నేను నా కెరియర్‌ని కూడా నిర్లక్ష్యం చేయడం లేదు. నాకు ఇలాంటి ఓ మంచి అలవాటుకి కారణం, ఒక రకంగా నాకు ప్రేరణ ఆమె.. దయచేసి నువ్వు ఆమెని తక్కువ చేయకు” అతని గొంతులోని విజ్ఞాపనకో, ప్రశాంతతకో మరిక వాదించలేదామె.

కాసేపటికి కాస్త తగ్గి అంది “ఇప్పుడామె ప్రస్తావన దేనికో” అని. కాసేపు మౌనం తర్వాత నోరు విప్పాడతను. “మా వైదేహత్త భర్త అంటే మా రామచంద్రం మామయ్య ఈమధ్యే కాలం చేశారుట”

కాసేపామెకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఆమె వల్లే భర్త పుస్తకాలని, పల్లెటూళ్ళని, తెలుగు వాతావరణం అని ఇలా ఊహా ప్రపంచంలో బ్రతుకుతుంటాడు. ఈ వేగవంతమైన కాలంలో ఈ ‘కాలం చెల్లిన ఆలోచనలు’ దేనికీ పనికిరావని ఆమె ఆలోచన. ఆమెకి, వైదేహత్తకి మధ్యనున్న ఆలోచనల అంతరం వల్ల మొదటి నుండీ ఆమెకి వైదేహత్తతో సఖ్యత లేదు. పెళ్లైన కొత్తలో భర్త తరచూ ఆమెను కలసి రావడం సహించలేక బాగా గొడవ చేసేది. దాంతో సంవత్సరాలు గడిచేకొద్దీ అతనికి అతని అత్తతో బంధం కూడా బలహీనపడింది. దాంతో పాటే అతని ఆలోచనలు, ఆశలూ కూడా కరిగిపోతున్నట్లనిపించేదతనికి ఏదో యాంత్రిక జీవనంలో బ్రతుకుపోరు చేయటం తప్ప. ఆమె దృష్టిలో భర్తకి, అతని మేనత్తకి జరిగే ఆ సాహితీ చర్చలు, అనేక మంది రచయితలు, కవుల గురించిన చర్చలు, వారి రచనల్లోని భావాలు, అభిప్రాయాలు ఇవన్నీ వృధా చర్చలు, సమయాన్ని వృధా చేయడాలు. అందుకే భర్తని ఎప్పుడూ నాలుగు డబ్బులు సంపాదించే ఆలోచనలు చేయమని పోరేది అతని ఉద్యోగమే కాక. ఈమధ్య కొన్నేళ్ల పాటు వాళ్లింట్లో ఆమె గురించిన ప్రస్తావన రాలేదు. అలాంటిది ఇన్నాళ్లకి ఇలా రావడం అదీ ఆమె కష్టాల్లో ఉందని తెలిశాక ఆమెకి ఇప్పుడు ఏమీ అనడానికి నోరు రాలేదు. చివరికి “ఎప్పుడు పోయారుట.. ఆమె ఎలా ఉన్నారిప్పుడు”

“ఆమె ధైర్యంగానే ఉన్నారని అంటున్నారు కానీ ఆమె మనసులో మాత్రం ఇంకా బాధ ఉందని, అదే ఇంట్లో ఉంటే ఇంకా మామయ్య ఆలోచనలు ఆమెని త్వరగా మామూలు మనిషిని చేయలేవని అందరూ అనడంతో కొన్నాళ్లు అలా కూతురు దగ్గర ఉండి రమ్మని చెబుతున్నారుట” అంటూ చెప్పుకొచ్చాడు ఆనంద్.

“మనమూ వెళ్లి చూసి రావాలి” అన్నాడు చివరగా.

“నాకెక్కడ కుదురుతుంది.. పిల్లలకి పరీక్షలు, వీళ్లని తీసుకొని ప్రయాణాలు అవీ అంటే చాలా పెద్ద తలనొప్పి”. అంతకన్నా ఆమె నుండీ మరేమీ ఎదురు చూడని అతను మాత్రం మరునాడు బయలుదేరి వెళ్లాడు. మూడు రోజుల తర్వాత ఆనంద్ తిరిగి వచ్చాడు ఒక్కడే కాదు తన మేనత్త వైదేహితో సహా...

ఒక్కసారి కంగారు పడింది సుష్మ. మొహమాటానికి ఏదో పలకరించింది కానీ భర్తతో లోపల గదిలో మాత్రం ఒక చిన్న సైజు యుద్ధం చేసింది. “అత్త పెద్దదయిపోయింది. ఆమెకు కొడుకులెవరూ లేరు. కూతురూ, అల్లుడు దగ్గరికి వెళ్లడానికి అభిమానం అడ్డొచ్చి ఒక్కతే ఉంటుంటే నేనే వెళ్లి పిలుచుకొచ్చాను. ఆమె నాకు చేసినదానికి ఈ రకంగానైనా ఎంతో కొంత చేయకపోతే నన్ను మనిషనరు. ఆమె కొన్నాళ్లు ఉండి వెళ్లిపోతుందిలే, అసలే భర్త పోయి,

ఎవరూ లేనట్లు ఉన్న తన మనసును ఇంకా కష్టపెట్టకు" అని మాత్రం చెప్పి భార్య మాట మరి వినకుండా బయటకు వెళ్లిపోయాడ తను.

"అయినా ఆమె మాత్రం ఎన్నాళ్లని మేన ల్లుడి ఇంట్లో ఉంటుందో నేనూ చూస్తాను" అని అనుకుంది సుష్మ.

అప్పటి నుండీ పెద్దామెతో ముభావం గానే ఉండేది. పనున్నా, లేకపోయినా పక్కిం టికో, షాపింగ్‌కో అంటూ వెళ్లిపోయేది. పిల్లలు ఎప్పుడైనా ఆమెతో మాట్లాడుతున్నా వారిని ఏదో వంకతో పక్కకి పిలిచేది. నిజా నికి ఓ పెద్దావిడతో, అదీ భర్త పోయి పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆమెతో ఇలా ప్రవర్తించాల్సి వస్తోన్నందుకు ఎప్పుడైనా కొంచెం వివేకం మేల్కొన్నా ఆమెలోని వ్యాపార ధోరణి దానిని అణగదొక్కేసేది. ఎందుకంటే సగటు కుటుంబమే బ్రతుకు బండిని ఈడ్చటం కష్టంగా ఉన్నా ఈ రోజుల్లో మరో మనిషి భారాన్ని కూడా మోయడం అంటే అది అనవసరపు ఖర్చని, రేపు తనకూ పిల్ల లున్నారు కనుక వారి గురించి కూడా చూడాల్సిన బాధ్యత తమకున్నాయనేది ఆమె వాదన.



ఓ రోజు పక్క ఫ్లాట్ సరోజతో షాపింగ్‌కి వెళ్లి వచ్చేసరికి పిల్లలిద్దరినీ కూర్చోపెట్టుకుని ఏవో కథలు చెపుతూ కనపడింది వైదేహత్త. ఎప్పుడూ వీడియో గేములు, టీవీలు అని కూర్చునే తన పిల్లలు అంత బుద్ధిగా కూర్చుని వినడం తనకే ఆశ్చర్యం ఉన్నా ఎందుకో అది తన 'ఓటమి'లా అని పించసాగిందామెకి.

చదువు, హోంవర్క్ ఏమీ లేవా... తీరిగ్గా కూర్చుని, ఈ కథలూ, కాకరకాయలూ వింటూ కూర్చుంటే ఎందుకూ పనికిరాకుండా పోతారు అని బయటకి అని, మనసులో 'మీ నాన్నలాగా' అని కూడా అనుకుంది.

"మేము మా హోంవర్క్ ఎప్పుడో చేసేసు కున్నాం... అమ్మమ్మ హెల్ప్ చేసిందిగా.." అంటూ "నువ్వు చెప్పు అమ్మమ్మ..." అంటూ తిరుగుబాటు బావుటా ఎగరేయడంతో 'పిల్లలను కూడా తన వైపు తిప్పేసుకుందన్న మాట...' అనుకొని "ఏం చేశారో ఏమో.. మీరు రేపు సరిగ్గా చేయకపోతే మీ స్కూలు టీచర్లు నన్నంటారు.. ఏదీ మీ హోం వర్క్ నోట్స్ ఇటు తీసుకురండి" అంటూ హడావుడి చేసింది. అయిష్టంగానే లేచి వెళ్లి తెచ్చి చూపించారు వాళ్లు. ఆశ్చర్యం.. ఎలాంటి తప్పులూ లేకుండా చేశారు వాళ్లు.. "ఎప్పుడూ లేనిది ఏంటి వీళ్లు?!" అనుకొంది. ఆ తరువాత పిల్లల్లో చాలా మార్పు చూడసాగింది సుష్మ.



స్కూలు నుండీ రాగానే బట్టలు మార్చుకుని, ఏదైనా తిని ప్లే గ్రౌండ్‌కో, పార్కుకో అమ్మమ్మను తీసుకొని వెళ్లడం.. చీకటిపడే వేళకి ఇంటికి వచ్చి, నీట్‌గా తయారయి గబగబా హోంవర్కు చేసుకొని, చదువుకోవాల్సినవి చదువు కొని, అన్నం తినేసి అమ్మమ్మ పక్కన చేరడం ఆమె చెప్పే

కథలు, కబుర్లు అబ్బురపడుతూ వింటూ నిద్రపోవడం, పొద్దునే పెందరాడే లేచి చకచకా తయారవ్వడం, పిల్లల్లో ఎంతో క్రమశిక్షణని చూస్తుంది సుష్మ. పిల్లల్లో వచ్చిన ఈ మంచి మార్పు ఆమెకి ఆనందాన్నే కలిగిస్తోన్నా అది తాను వ్యతిరేకించే 'కాలం చెల్లిన భావాలు' ఉన్న మనిషి వలన కావడమే ఆమెకి కాస్త ఇబ్బందిగా ఉంది. అంతేకాక పగటి పూట ఇంట్లో భర్తా, పిల్లలూ వెళ్లిపోయాక అపార్ట్‌మెంట్లోని ఆడవాళ్లూ ఈమధ్య తరచూ రావడాన్ని ఆమె గమనించింది.

దానికి కారణమూ వైదేహి. ఆమెకున్న లోక జ్ఞానం, ఆమె అనుభవాలు చెబుతుంటే అంతా ఏదో మైకం కమ్మేసిన వాళ్లలాగా వింటూ ఉండేవాళ్లు.

చిట్కా వైద్యాలు, పురాణాలు, వ్యక్తిత్వ వికాసం. రాజకీయాలు, సాహిత్యం, కుట్లు, అల్లికలు, వంటలు, గార్డెనింగ్, ఇంటీరియర్ డెకరేషన్ ఇలా ఒకటేమిటి ప్రతి దాంట్లోనూ ఆమెకుండే అపారమైన జ్ఞానం, ఆమె చెప్పే విధం ఎలాంటివారినైనా ఆకట్టుకునేవి. ఆమెని నడిచే ఓ గ్రంథాలయంలా చూసేవారు. ఆమె తనతో పాటు తెచ్చుకున్న కొన్ని పుస్తకాలను చూసి, అవి చదివి ఇస్తామని అంతా తీసుకెళ్లేవారు. కొందరు ఆమెనడిగి వాళ్లకి పనికి వచ్చే కొన్ని పుస్తకాల పేర్లను చెప్పించుకుని వాటిని కొనుక్కొచ్చి మరీ చదివేవారు. రాను రానూ ఆమె అక్కడ ఎంతో ముఖ్యమైన మనిషి అయిపోయింది. నిజంగా ఆమె లాంటి వ్యక్తిని అక్కడకి తీసుకువచ్చిన సుష్మ, ఆనంద్ దంపతులు ఎంతో మంచివాళ్లని వీళ్ల గురించి కూడా అంతా మంచిగా చెప్పుకోవడంతో ఏమనాలో సుష్మకి అర్థం కాలేదు.

ఎందుకో ఆమెకి మాత్రం ఏమి చూసి తన భర్త పిల్లలు, ఫ్లాట్స్‌లోని మిగతావారూ ఆమె అభిమానిస్తున్నారో అని మాత్రం అనిపించేది. ఆమె ఇప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి, ఇప్పటి జనాల తీరు తెన్నులకి, ఇప్పటివారి అభిరుచులకీ ఎంతో దూరం. కానీ వీరినే తన పాత భావాల పట్ల అంటే తన దృష్టిలో కాలం చెల్లిన భావాల పట్ల ఆకర్షింప చేస్తోందంటే ఆ గొప్పదనం ఎక్కడుందో అనే అనుమానాలు మాత్రం వస్తుండేవి సుష్మకి. అలా కొన్నిసార్లు ఆమెకి కలిగే అనుమానాలను దూరం చేయడమే కాక కొన్ని కొన్ని సార్లు వైదేహత్త సమస్యలకు ఇచ్చే పరిష్కారాలు చూసి సుష్మ ఆమెలోని గొప్పదనాన్ని, ఆమెకున్న జ్ఞానాన్ని అర్థం చేసుకుంది. ఆమెకి ఇంత జ్ఞానాన్ని ఇచ్చిన పుస్తకాల పట్ల ఆమెకుండే ద్వేషం కూడా మంచులా కరిగిపోయింది. జీవితం అంటే కేవలం డబ్బు సంపాదన మాత్రమే కాదని అర్థమవ్వసాగింది. కొన్నాళ్లకి సుష్మలో కూడా కొంత మార్పు వచ్చింది. మునుపటిలా ఆమె వైదేహి పట్ల దురుసుగా ఉండటం లేదు. పిల్లలతోనూ, భర్తతోనూ ప్రేమగా ఉండసాగింది. ఆమెకి తెలియకుండానే ఆమె కూడా వైదేహి పద్ధతుల పట్ల ఆకర్షింపబడుతున్న రోజుల్లో ఓరోజు వైదేహి 'ఇక నేను తిరిగి మా ఊరు వెళ్లిపోతానురా ఆనంద్ అంది'. అందరితో పాటు సుష్మ కూడా ఆమెను అక్కడే ఉండిపొమ్మని బ్రతిమాలింది. "లేదమ్మా ఎప్పటికీ ఇలా ఇక్కడే ఉండిపోలేను. అప్పట్లో ఆయన పోయిన వెంటనే అదే చోటా ఉంటే నేను మామూలు మనిషి కాలేనని ఆనంద్ పట్టుబడితే కాదనలేకపోయాను, ఇక వెళ్లక తప్పదు" అని సున్నితంగా అందరి అభ్యర్థనని తిరస్కరించింది. ఆమె వెళ్లిన రోజున ఆ ఇంట్లోని వారే కాక ఆ ఫ్లాట్స్‌లోని మిగతావారు కూడా కంట తడి పెట్టుకొన్నారు. ఆమెని తిరిగి వాళ్ల ఊళ్లో దించుతానన్న ఆనంద్‌ని కూడా వారించి కేవలం రైల్వేస్టేషన్ వరకూ మాత్రం అంగీకరించింది. రైలు వెళ్లబోయే ముందు కృతజ్ఞతగా ఆమె రెండు చేతులూ పట్టుకొన్నప్పుడు అతని కన్నీటి చుక్క ఆమె చేయిపై పడటంతో అతని జుట్టు నిమిరి ధైర్యంగా ఉండమన్నట్టు చూసి నవ్విందామె. ఒకనాడు తన జీవితాన్ని తీర్చిదిద్దిన ఆమెకి తాను తోడుగా ఉండాల్సిన అవసరం ఆమెకి లేదని అతనికి తెలిసినా తన ఇంటిని, ఇల్లాలిని కూడా ఓ దారిలో పెట్టమని అతనే అమెని తీసుకువచ్చిన విషయం మాత్రం వారిద్దరి మధ్యే ఉండిపోయింది.

★



## మరోసారి ద్విపాత్రాభినయం

అనుష్క నటించిన 'అరుంధతి' తర్వాత ఆమెకి పేరు తెచ్చిన సినిమా మరొకటి రాలేదు. విడుదలకు తుదిమెరుగులు దిద్దుకుంటున్న 'పంచాక్షరి' సినిమా మరోసారి అనుష్క కెరీర్‌ని మలుపు తిప్పుతుందేమో అంటున్నారు. ఇందులో కూడా అనుష్క ద్విపాత్రాభినయం చేస్తోంది. రెండు పాత్రలూ వేటికవే ప్రత్యేకత గలవి అంటోందామె. అలాగే ఇందులో 'మగధీర' సినిమాకి పేరడీలా కామెడీ ఎపిసోడ్ ఒకటి వుంటుందిట. బ్రహ్మానంద-అనుష్కల మీద తీసిన ఈ కామెడీ ట్రాక్ కూడా ఎట్రాక్షన్‌ట.